# మలయ పవనాలు

సాయంత్రం అయిదు కావస్తూంది. పిల్లతెమ్మెరలు మంద్రమంద్రంగా సాగివస్తున్నాయి. ఆలమందలు పచ్చిక బయళ్ళనుండి తిరిగివస్తున్నాయి. పక్షులు గూళ్ళు జేరుకుంటున్నాయి. పాఠశాలలనుండి బాలబాలికలు, కళాశాలలనుండీ, ఆఫీసులనుండీ యువతీయువకులు గృహోన్ముఖులయ్యారు. అప్పుడే సినిమాలకూ, షికార్లకూ జనం ఒంటరిగా, జంటలుగా బయలుదేరుతున్నారు. ఎటుచూచినా జనం, వాహనాలు - విపరీతమైన సందడిగా వున్నది.

వీధి వరండాలో కూర్చుని భర్త రాకకూ, బిడ్డల రాకకూ ఎదురుచూస్తోంది శైలజ నామకార్థం ఆమె చేతిలో ఏదో పత్రిక నలుగుతూన్నదే కాని దృష్టి దానిపై లేదు. మాటిమాటికీ వీధిమొగవైపే చూపులు పరుగెడుతున్నాయి. పరిచితమైన జీప్‌హారన్ కోసం చెవులు రిక్కించుకు వింటోంది.

"మమ్మీ! ఇంకా డాడీ రాలేదూ?" ఆటల మధ్యలో వచ్చి అప్పుడే రెండోసారి - ఇది శ్రీనాధ్ ప్రశ్న.

విసుగెత్తివున్న శైలజ సమాధానం కటువుగా వున్నది: "వస్తే కనిపించరేంరా? మళ్ళీ ప్రశ్నకూడా ఎందుకూ?"

శ్రీనాధ్ చిన్నబుచ్చుకుని, అమ్మవేపూ వీధివేపూ రెండుసార్లు చూచి వెళ్ళిపోయాడు మరి మాట్లాడకుండా.

చివుక్కుమన్నది శైలజ మనసు, చిన్నబుచ్చుకున్న శ్రీనాధ్‌ని చూడగానే. 'తన మనస్సులోని చీకాకును ఆ పసివాడిమీదా ప్రదర్శించడం? ఇదేనా తన తెలివీ, వయసూను?'

దూరాన జీప్ హారన్ వినవచ్చింది. 'హమ్మయ్య!' తేలికగా ఊపిరి పీల్చుకుని, పుస్తకం ప్రక్కన పడవేసి, సంభ్రమంగా లేచి నిలబడింది శైలజ, వీధి మలుపువైపే దృష్టి సారించి. జీప్ వేగంగా దూసుకురావడమూ అయింది; కనుల ముందునుంచే పోవడమూ అయింది! అది మరో ఆఫీసు జీప్! తిరిగీ నిస్పృహ ఆవరించిన మనసుతో కూలబడింది, కుర్చీలో. 'ఛ. మామూలుగా అయితే ఏదీ విన్పించదు; మనం దేనికోసమైనా ఎదురు చూస్తున్నప్పుడే సరిగా అటువంటివే సవాలక్ష వినవస్తాయి, మనను ఉడికించుతూన్నట్లుగా!' నిజంగానే ఉడుక్కుపోతోంది శైలజ నసు.

తమతమ నెలవులు జేరుకొనేజీవరాసులతో హడావుడిపడే సాయంత్రం, మెల్లమెల్లగా ప్రశాంతమైన అసురసంధ్యగా

మారింది. వీథిదీపాలు వెలిగాయి. ఒక్కసారిగా గుర్తుకువచ్చి నట్లుగా ఉలిక్కిపడి లేచింది శైలజ పోయి దేవుడు గదిలో లైటు వేసి, చెప్పులు విడచి ఒక్కసారి దైవానికి నిర్మలంగా నమస్కరించింది. చిన్నలైటువేసి తలుపులు మూసి వస్తూంటే అమాంతంగా వచ్చి ఏడుస్తూ కాళ్ళకు చుట్టేసుకున్నాడు శ్రీనాథ్. వాడివెంటే అంతకంటె బిగ్గరగా ఏడుస్తూ లత వచ్చింది.

"చూడు మమ్మీ —" నామకార్థం మాత్రమే తల్లికి ఫిర్యాదు. అదేదో పూర్తిగా వివరించకుండానే తమ్ముడిని రెండు కొట్టింది లత. ఈసారి తల్లి ఎదుట వున్నదనే ధైర్యం తోనేమో - శ్రీనాథ్ తిరగబడి లతకు అంతకు రెట్టింపు సత్కారం చేశాడు.

"నా బొమ్మ... ... నా కియ్యి ... ... ..."

"మరి నువ్వు నాతో ఎందుకాడుకోవు?"

"నా 'కీ' కై లేదీ?"

"ముందు నాబొమ్మ యియ్యి!"

ఎవరిమట్టుకువాళ్ళే ఇల్లెగిరి పోయేట్టు కంయ్యి కంయ్యిన అరుస్తూ పోట్లాడుకుంటూ, మధ్యమధ్యన తన చుట్టూ తిరిగి చీరకుచ్చెళ్ళు పట్టుకు లాగుతూంటే శివమెత్తిపోయింది శైలజ.

"ఏమిట్రా దరిద్రపుగోలా! అంతగా పడిచావని వాళ్లు యెందుకు ఒక్కచోట జేరడం? విడివిడిగా ఏడవరాదూ?" అంటూనే అసహనం మితిమీరిపోగా చేతిసత్తువకొద్దీ నాలు గేసి అంటించింది.

"అమ్మా! అమ్మా!" తమ మధ్య దెబ్బలాటను మఱచిపోయి పిల్లలిద్దరూ ఒక్కచోట కూర్చుని ఏడుస్తూంటే తిరిగి మనస్సు ద్రవించిపోయింది. 'కొడితే పారిపోవడం, చెయ్యి అడ్డుపెట్టుకోవడంకూడా తెలియనంత పసితనం. అమాయకత్వం! వీళ్ళనా కొట్టాను? దెబ్బలాడుకోవడం, కొట్టుకోవటం తప్పని తెలియని వయసువాళ్ళు. మరి నా విచక్షణ ఏమైపోయింది?' మనస్సులోనే మథనపడుతూ ఇద్దరినీ చేరదీసి, చెరో చేతితోనూ ఎత్తుకొని ఊరుకోబెట్టింది. ఆటల్లో మట్టిగొట్టుకుపోయిన బట్టలు తీసేసి ఒళ్ళు కడిగి, ఇద్దరికీ మళ్ళా మరో దుస్తులు వేసింది.

"అన్నం తింటారా, పాలు త్రాగుతారా?"

"ఏదీ వద్దు." లత సమాధానం.

"దాడీ వచ్చాక ... తింతాం." శ్రీనాథ్ మాటలు.

"దాడీ వచ్చేసరికి మీరు తినేసి కూర్చుంటే బాగుంటుందిరా. 'వెరీగుడ్' అంటారూ." తానూ వాడిని అనుసరించి మాట్లాడుతూ నవ్వించింది. అన్నం కలిపి బలవంతాన రెండు ముద్దలు తినిపించబోయింది. లత భయంవల్ల కాస్త తిన్నది కాని, శ్రీనాథ్ చేత యెంతకు తిన్పించలేకపోయింది. "సరే కొంచం పాలైనా త్రాగు". వాడు వద్దన్నా బలవంతంగా ఓ అరగ్లాసు పాలు నయానా భయానా త్రాగించింది.

"వద్దు మమ్మీ, వద్దు మమ్మీ" అని అయిష్టంగా త్రాగుతూనే శ్రీనాథ్ వాంతి చేసేసుకున్నాడు.

తిరిగి కోపంతో ప్రజ్వరిల్లిపోయింది శైలజ. వాడు వాంతిచేసుకున్నాడనైనా దయలేకుండా బరబరా బాత్‌రూమ్‌లోకి ఈడ్చుకెళ్ళి, గుడ్డలుతీసి ఓ మూలకు విసిరింది. చన్నీళ్ళతోనే వాడి కాళ్ళూ, చేతులూ, మూతీ కడిగి మళ్ళీ లోపలికి లాక్కొచ్చింది. "బొత్తిగా తిండీ తినక, పాలూ త్రాగక ఏం చేద్దామనీ? అందుకే బలాలు ఇలా అఘోరిస్తున్నాయి ..." సాధిస్తూనే తిరిగి మరో దుస్తులు వేసి పడుకోబెట్టింది. వెక్కుతూనే శ్రీనాథ్ నిద్రకొరిగాడు. ఈ యజ్ఞమంతా చూచిన లత ముందే బెదరిపోయి ఓ మూల నిద్రపోయింది నేలమీదే.

పిల్లలిద్దరూ నిద్రకొరిగేసరికి అంతకుముందు భీకర రణరంగంలాగా ప్రతిధ్వనించిన ఇంటిని ఎక్కడలేని నిశ్శబ్దతా ఆవరించింది. తిరిగీ శైలజ మనసును నీరస నిర్వేదాలావరించాయి.

'పాపం, క్రిందనే నిద్రపోయింద' అనుకుంటూ లతను లేవనెత్తి, నోట్లో పెట్టుకున్న వేళ్ళు నెమ్మదిగా తొలగించి, మంచం మీద పడుకోబెట్టి ప్రక్కనే కూర్చుంది. అమాయకంగా నిద్రిస్తూన్న ఆ పసి వదనాలు రెంటినీ చూచిన శైలజ మనస్సు ఏమిటో తనకే తెలియనంతగా బాధపడింది.

ఇంకా భర్త ఇల్లు జేరలేదు. అది తన బాధ! బాధా? బాధకాదు; నిజానికి ఆరాటం ! ఆ విసుగులో పిల్లల్ని అసహనంగా కొట్టింది, విసుక్కుంది ! తన అసహనాన్ని ఆ అసహాయులపై ప్రదర్శించిన తాను క్షమార్హురాలేనా ? తాను

భర్తకోసం ఎదురు చూచినట్టే, పిల్లలు తండ్రికోసం చూస్తారు కదా !

"డాడీ రాలేదా ?" అని ఆశగా ఎన్నోసార్లు అడిగి నిరుత్సాహ పడ్డారు 'వస్తారమ్మా!' అని ఓపికగా లాలనగా చెప్పలేకపోయింది తాను.

డాడీ వస్తే నవ్వుతూ కబుర్లు చెప్తారు. పార్కుకో, బజారుకో తీసుకెళ్తారు. మమ్మీకూడా పని పాటలన్నీ వదిలేసి కాస్సేపు కబుర్లతో నవ్వుతూ కాలక్షేపం చేస్తుంది. విసుక్కోదు. అందుకే పిల్లలు ఆశగా తండ్రి రాకకోసం ఎదురు చూస్తారు. ఇరవైనాలుగు గంటలూ తమతో వుండి, అనుక్షణం తమకు కావలసినవన్నీ అమర్చిపెట్టే తల్లి, తమ సేవల లోనే మునిగిపోయే తల్లి వారికి మొఖం మొత్తుతుంది కాబోలు ! అరుదుగా కన్పించే తండ్రికోసమే అపురూపంగా ఎదురు చూస్తారు !

ఈ ఊహ మనసున మెదలి కలుక్కుమన్నది శైలజ హృదయం. 'ఏమిటిది ? భర్తను చూచి అసూయపడ్తోందా తను ?'

"ఛ. లేదు." తనకు తానే తిరిగి సగర్వంగా, నిస్సంశయంగా సమాధానం చెప్పుకొంది. "ఒక్కనాటికికూడా అలా జరగదు. భర్తనూ బిడ్డలనూ చూచి అసూయపడే నీచనైజం కాదు తనది. ఎప్పుడూ ఈ తండ్రీ బిడ్డ లిలాగే సుఖంగా, ప్రేమగా ఉండాలి. పిల్లలు తండ్రికి దగ్గరవ్వడమే మంచిది. ఓ పదిపన్నెండేళ్ళ వఱకే పిల్లలకు తల్లి సేవా, ప్రేమా అవ

సరం. అంతే, ఆ తర్వాత తల్లి లేకపోయినా బ్రతకగలరు. అందుకే ... అందుకే ... తండ్రీ బిడ్డలు చనువుగా ప్రేమగా ఉండాలి... తానేమైనా ఫర్వాలేదు." ఈ యోచన రాగానే శైలజ కనులు అప్రయత్నంగా చెమరించాయి.

"అమ్మగారూ, ఫోన్ !" పరధ్యానంగా ఉన్న శైలజ నౌకరు రాంచరణ్ పిలుపుకు ఈ లోకంలో పడి గబగబ డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళి ఫోన్ రిసీవ్ చేసుకుంది.

"హల్లో !"

"ఆఁ. ఒరేయ్ ... శైలూ, నేనే !" అవతల శేఖరం గొంతు పలుకుతోంది. అతి ప్రేమ కలిగినపుడూ, ఇంటికి ఆల స్యంగా జేరడం గురించి సంజాయిషీ చెప్పకుండా దాటవేద్దా మనుకున్నప్పుడూ అతడికి భార్యని ఒరేయ్, ఏరా — అని ఓ స్నేహితుణ్ణి పిలిచినట్టు పిలవడం అలవాటు

"ఏమిటి ? ఎక్కడినుంచి మాట్లాడుతున్నారు ? ఇంకా ఆఫీసు పనేనా ?" మామూలు ధోరణిలోనే అడిగింది శైలజ.

తేలికగా నవ్వేశాడు శేఖరం.

"ఆఁ. లేదురా. ఆఫీసుపని సాయంత్రం అయిదు గంట లకే అయిపోయింది. ఓ స్నేహితుడు కొంచం ఇబ్బందుల్లో పడ్డాడు అతడి కేదో కోర్టు వ్యవహారం తగిలింది. కాస్త ఆ కాగితాలవీ చూసిపెడ్తున్నాను."

"అయితే ఆ స్నేహితుడింట్లోనే ఉన్నారన్నమాట ప్రస్తుతం ?"

"ఔను. ఏం ?"

"ఏమీ లేదు." మనస్సులో కోపంగావున్నా ఆ కోపం వీలైనంత వరకూ కంఠంలో ధ్వనించకుండా జాగ్రత్తపడింది. "ఈచేసే ఫోను ఇంకాస్త ముందు చేస్తేఏం పోయింది చెప్పండి. టైముకు మీరు రాకపోతే ఎంత ఖంగారు పడ్డానో తెల్సుకదా! పిల్లలు మీకోసం చూచీ చూచీ ఏడ్చి పడు కున్నారు."

"ఏం చెయ్యను చెప్పరా మరి!" శేఖరం గొంతులో ఎంతో మార్దవం! "అయిపోతుందీ, వద్దాం వద్దాం అనుకుం టూండగానే ఇంత టైమైపోయింది. భోజనం చేశావా?"

"లేదు." ఈసారి కంఠంలో కఠినత్వాన్ని కప్పిపుచ్చ లేకపోయింది శైలజ. "వచ్చాక ఇద్దరం తిందాం. ఒక్క తెనూ ఎప్పుడైనా తిన్నానా?"

నవ్వేశాడు శేఖరం. "సరే. మరో అరగంట పట్టొం దేమో నేను వచ్చేసరికి. ఊఁ. కాస్త ఓపికపట్టూ!" లాల నగా అంటున్నాడు.

"అలాగే. రండి. కూర్చుని ఉంటాను." ఫోను పెట్టే సింది.

'స్నేహితుడు ఇబ్బందిలో పడ్డాడటా! అందుకని ఈయన అర్ధరాత్రైనా కొంపకు జేరుకోకుండా ఉద్ధరిస్తున్నా రట! ఇదేమైనా బాగుందా?' అనుకొంది.

'ఔనూ, నీకిదేమైనా బాగుందా?' తన మనసు తననే ప్రశ్నించినట్లైంది. 'స్నేహ ధర్మం నీకు తెలియనిదా? స్నేహి తుణ్ని అవసరాలలో, కష్టాలలో ఆదుకోపోతే ఎలా? మీకు అవసరాలొస్తే మళ్ళీ ఆ స్నేహితులు ఆదుకోరా?'

'ఆదుకోవద్దని ఎవరన్నారూ ?' శైలజ ప్రశ్న. 'కాని వాళ్ళ కోసమని భార్యాబిడ్డల ముఖం చూడకుండా అక్కడా అక్కడా వున్నానంటే ఎలా ? పగలంతా ఆఫీసు పని. తర్వాత స్నేహితులూ అయితే ఎలా ? జీపుకు దారిలో ఏమైందో ఏమిటో అని ఇంతవఱకూ తానెంత ఖంగారెత్తింది ? పిల్లలెంతగా ఎదురు చూశారూ ? తన చీకాకుతో తాను కూడా వాళ్ళని తిట్టి కొట్టి హింసించింది.'

ఓసారి ఇటువంటి సందర్భంలో ఇదే మాట భర్తతో అంటే ... "ఆఁ. మరీనూ. ఎప్పుడో ఒక్కనాడు కాస్త స్నేహితులతో వెళ్లితేనే అలా యిదై పోతావ్. మరీ స్వార్థంగా ఆలోచిస్తావ్." అనేశాడు.

'భార్య భర్తతో హాయిగా, కులాసాగా గడపాలను కోవడం స్వార్థమా ? ఆశించకూడనిదా ?'

'పోనీయ్. ఇవన్నీ తెగని ప్రశ్నలు.' ఆలోచనలనుంచి మనస్సును త్రిప్పాలనే ఉద్దేశ్యంతో పత్రిక తీసుకుంది చేతికి.

కాని అటువంటి ఆలోచనలను పారద్రోలగల శక్తి మనుష్యులకే ఉంటే ఇక కానిదేముందీ ? ఏమైతే తుడిచేసి మనస్సును శుభ్రపఱచుదా మనుకుంటామో అవే తలపోతలు కుండపోతలుగా కురిసే వానలా చీకాకెత్తించడం సర్వ సాధారణం.

'ఇంటిలో ఫోను వుండీ ఉపయోగించుకోకుంటే యిక సౌకర్యమేమిటీ? ఇంటికి ఆలస్యంగా రాదలచుకొన్న మనిషి కాస్త ఫోను చేస్తే ఆరాటం తగ్గుతుంది ఇంట్లో ఎదురు తెన్నులు చూచేవాళ్ళకి. అయితే ... ఆ ఫోను చేయటానికే యెంతో

మొగమాటం, భర్తకి. ఇతర్ల ఫోను వాడుకోవడ మెందుకులే అనే సంశయం. తానైతే ఇతర్లకు ఎన్నేసి సాయాలైనా ఎంతెంత ఉపకారాలైనా చేస్తాడు. డబ్బుకూ శ్రమకూ కూడా వెనుక ముందులాడకుండా. స్వవిషయంలో మాత్రం, ఇతరుల నేది అడగాలన్నా సంశయమూ, బిడియమే! బొత్తిగా ఇలా గైతే ఎలాగ ?'

'హుఁ! చేతిలో పుస్తకం బరువు తప్ప చదువూ లేదు, ఏమీ లేదు.' పుస్తకం యధాస్థానంలో ఉంచేసి లేచింది.

అమ్మగారు పరధ్యానంగా కూర్చోవడంలో, నౌకర్లు ఏం తోచనట్టు తచ్చాడసాగారు. బయట వాచ్‌మన్ శీతల్ రాంచరణ్‌తో కబుర్లలో పడ్డాడు. లోపల అమ్మగారి సోఫాకు కొంచం దూరంలో క్రింద కూర్చుని వాడూ ఏదో పుస్తకం తిరగేసుకుంటున్నాడు మరో నౌఖరు మణి. మాటిమాటికీ తన డెస చూస్తున్నాడు వాడు.

గ్రహించుకోగలిగింది శైలజ. వాడికి భోజనం వేళైంది. వాళ్ళు చేసే పనిపాటలు యెలావున్నా, యజమానులు యెలా ఉన్నా, తిన్నా తినకపోయినా ముందుగానే వేళకుసరిగా వాళ్ల ముడుపులు చెల్లిపోవాలి. లేకుంటే చెడ్డపేరు వస్తుంది. మిగత అన్నిళ్ళల్లోనూ పద్ధతులెలావున్నా, తమ యింట్లో పద్ధతి మాత్రం అది !

"రారా. అయ్యగారెప్పటి కొస్తారో! నీకు పెట్టే స్తాను." అంటూ లేచింది.

"పిల్లలు పడుకున్నారు. అయ్యగారింకా రాలేదు. కూర్చుంటే కూర్చో, పడుకుంటే పడుకో !"

అమ్మగారి నోటినుంచి మాట వచ్చిందే చాలన్నట్లుగా వాడు గబగబా తినేసి, బీడీ కూడా కాల్చేసుకుని వాడి గది లోకి పోయి ముసుగుదన్ని పడుకున్నాడు.

రాంచరణ్ వచ్చి అటు ఇటు తచ్చాడాడు. "తలుపు లన్నీ వేసేయమంటారా అమ్మా?" అనడిగాడు.

'అంటే — నేను మరి వెళ్ళనా అమ్మా?' అని అడగడం!

"ఆఁ. వేసేసి వెళ్ళు. అయ్యగారు రావటాని కింకా ఆలస్యముంది."

శేఖరం వచ్చాక బూట్లు పెట్టేసి, చెప్పులు అందించడం, స్నానానికి వేడినీళ్ళు వగైరా అమర్చడం — ఏదో అలా అలా తిరుగాడుతూ ఉంటాడు. శేఖరం భోజనంచేసి కూర్చున్నాక పేపరు అందించి, సిగరెట్ కేస్, ఆష్ట్రే అందించి, ఓ పది నిముషాలు - శేఖరం మూడ్ బాగుండి అతడేమైనా మాట్లాడితే మాట్లాడి వెళ్ళిపోతుంటాడు.

ఇలా శేఖరం రాక ఎప్పుడైనా ఆలస్యమైనప్పుడు, పిల్లలతో ఒక్కతీపడలేక గానీ, భయంతో గానీ కాస్త తోడుగా ఉంటారు కదాని నౌకర్లని ఉంచుకుంటే ఆ పని తప్పేమన్న ట్లుగా అయిష్టంగా మాట్లాడతాడు శేఖరం, వస్తూనే.

"వాడికింకా అన్నం పెట్టలేదూ! ఎందుకూ పాపం మనతోపాటు వాళ్ళకి కూడా ఈ ఆలస్యాలన్నీ? వాళ్ళకి టైముకు భోజనం పెట్టేయాలి."

"రాంచరణ్‌ను ఇంటికి పంపేయక ఇంకా అట్టే

పెట్టావా? ఛ. ఎందుకు? పాపం, వాళ్ళకీ ఇళ్లూ, సంసారాలూ ఉన్నాయి కదా !"

ఈ విధంగా ఉంటుంది శేఖరం ధోరణి.

నిస్సహాయంగా నవ్వుకుంటుంది శైలజ. చరాచర జీవ రాసులన్నిటి కష్టసుఖాలూ తెలిసిన మహానుభావులు! నిజంగా ఈ విషయంలో అతడిని అభినందించ వలసినదే అంతటి ఉన్నతమైన హృదయం కలిగివున్నందుకు. కానీ ... భార్యకు కూడా ఓ మనసూ, కొన్ని కొన్ని కోరికలూ, అభిప్రాయాలూ వుంటాయని మాత్రమే తెలియదు. మరి దీనికే మనుకోవాలీ? అఫ్‌కోర్స్, నో మేరేజ్ పెర్ఫెక్ట్! ఏదో విధంగా సరిపెట్టుకోనిదే జీవితాలు సాగించడం కష్టంకదా!

"చూడూ, రాంచరణ్ !" వెళ్ళిపోతూన్న వాడిని మళ్ళీ వెనుకకు పిలిచింది. "చూడూ-సుధమ్మగార్ని ఖాళీగా ఉంటే వచ్చి కాసేపు కూర్చుని పొమ్మని చెప్పు, దారిలో నేగా ?"

"చిత్తం !"

ఒక్కసారి వెళ్ళి పిల్లలు ఎలా నిద్రపోతున్నారో, రగ్గులు సరిగా ఉన్నాయో, తీసిపారేశారో చూచి సరిచేసి వచ్చి మళ్ళీ కూర్చుంది.

ఓ పది నిముషాలకే సుధ వచ్చిన అలికిడైంది వరండాలో. వాచ్‌మన్‌తో ఏదో చెప్పి వస్తోంది.

"వచ్చావా ?" నవ్వుతూ ఆహ్వానించింది శైలజ.

"ఆహాc. వచ్చేశాను. తమరు కబురంపించడం నేను

రాకపోవడం కూడానా ?" గలగలా నవ్వేసింది. "ఇంతకీ ప్రాణనాధులింకా ఇల్లు జేరలేనట్లుంది. అందుకే దయ మా మీదికి ప్రసరించింది. ఔనా ?" మళ్ళీ నవ్వేసింది ఇల్లంతా ప్రతిధ్వనులీనేటట్లు.

ఈసారి శైలజకూడా శృతి కలుపకుండా ఉండలేక పోయింది.

శైలజ ఆలోచనలు తెగ పరుగులిడుతున్నాయి.

సుధ పంజాబీల అమ్మాయి. ఎమ్మే పాసైంది. మధ్య తరగతి సంసారులు. రెండేళ్ల క్రిందట పెళ్ళికూడా అయ్యింది. రెండు నెలల క్రితం భర్త ఏదో ట్రెయినింగ్‌కై జర్మనీ వెళ్ళాడు. ఈ రెండు నెలల నుంచీ సుధ పుట్టింట్లోనే ఉంటోంది. కాని, ఏ క్షణాలో చూచినా అలాగే చక్కగా నవ్వుతూ త్రుళ్ళుతూ ఏ విచారమూ లేనట్టే వుంటుంది. ఇదెలా సాధ్యం ?

"ఏమిటి భాభీ అలా చూస్తున్నావ్ ? నా అందం ఆకట్టుకుండా ఏం కొంపదీసి ? మా వారిక్కడ లేరు కూడా!" అంటూనే ఫక్కుమన్నది సుధ.

"నేనేమి అబ్బాయినిగానీ కాదులే భయపడకు !" తానూ విరగబడి నవ్వింది శైలజ.

"సుధా, ఒక్కటడగనా ? నవ్వకుండా జవాబు చెప్తావా ?"

"ఓ !" ఆశ్చర్యాన్నభినయిస్తూ కళ్ళు త్రిప్పింది సుధ.

"భాభీ ఏమిటో క్రొత్తగా మాట్లాడ్తోం దీవేళ !"

"నువ్వింతగా ఎప్పుడూ సంతోషంగానే వుంటావ్ సుధా. ఏమీ విచారం - ఐమీన్ - విచారమే కాదనుకో, ఆలోచన-సమస్య వగైరా లేమీ ఉండనే ఉండవా నీకు?"

చిరునవ్వుతో చూచింది శైలజ దెస, సుధ మాట్లాడకుండా.

"సీరియస్‌గా అడుగుతున్నాను సుధా. ఎప్పుడూ నవ్వుల రాసిలాగా, చైతన్య స్రవంతిలాగా ఉండే నిన్ను చూస్తే నాకెంతో ముచ్చటగా అబ్బురంగా ఉంటుంది. ఇదెలా సాధ్యం? నీకేమీ సమస్యలూ, విచారాలే వుండవా? అన్నీ సంతోషాలేనా?"

వింటూనే సుధ వదనం గంభీరంగా మారిపోయింది.

"బాభీ!" చాలా మెత్తగా, నెమ్మదిగా సంబోధించింది సుధ. "ఈ మానవకోటిలో విచార మనేది ఎరుగని ప్రాణి ఉంటుందా అసలు? నువ్వా బాగా చదువుకొన్నదానివే కదా?" సుధ మాటలలో సమాధానం లేదు. ప్రశ్నే మరింత జటిలమైంది.

శైలజ మాట్లాడటానికేమీ లేదు అందులో.

సుధ నెమ్మదిగా నేల చూపులు చూస్తూ అన్నది: "బాభీ! నా భర్త ఎక్కడో వున్నారు; నే నిక్కడ." సుధ కంఠం గాద్గదికమైంది.

"అరె!" తత్తరపాటుతో అన్నది. "ఛ. బాధపడకు సుధా. ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మీ. లీవ్ ది టాపిక్."

ఒక్క నిముషంలో తేరుకుంది సుధ. తనను తాను సంభాళించుకుని కూర్చుంటూ నవ్వేసింది ఏమీ జరగనట్టే.

"తల్లీ-తండ్రీ, అన్నా-తమ్ముడూ, అక్కా-చెల్లీ—అందరి మధ్యనా వుంటున్నాను. అత్తా-మామా, వదినలూ, మరుదులూ అంతా ఉన్నారు అత్తింట. అయినా, అంతా ఉన్నారు, అందరూ నావాళ్ళు అనుకోగలనా ! అంతకంటె-అనుకోనిస్తారా అంటే బాగుంటుంది కదూ !"

ఆశ్చర్యంగా వింటోంది శైలజ.

"నా జీవితంలో పూర్తిగా కాకున్నా, కొన్ని కొన్ని విషయాలు వివరించానా !" సుధ పెదవులు నవ్వుతున్నాయి. కనులు మాత్రం జల పూర్ణమైవున్నాయి. భావోద్వేగంతో ముఖం అరుణవర్ణం దాల్చింది.

* * * * * *

నలుగురున్న కుటుంబంలో అతిగారాబాలతో పిల్లల్ని పెంచకపోయినా, తలిదండ్రులు బిడ్డలను అక్కరలేనట్టుగా చూడరనేదీ, ప్రేమగానే పెంచుకుంటారనేదీ లోకవిదితం. అయినా అటువంటి లోక సహజమైన విషయాలను కూడా రద్దుచేసి, విపరీతంగా చూపించి, పెడార్థాలతో పెడసరంగా మాట్లాడి మనుష్యులను చిత్రహింసను మించిన మానసిక వ్యధకు గురిచేసి సంతోషించడం సుధ అత్త అయిన రంబ నకు అలవాటు

సుధ తండ్రీ ఇంద్రసింగ్ అతడి వియ్యంకుడు గురు చరణ్‌సింగ్ ఇద్దరికీ ఎప్పుడో ఎక్కడో పరిచయంవంటి స్నేహం ఉన్నదట. ఎప్పుడో పిల్లలు పుట్టకముందో - తమ తమ వివాహాలవ్వకముందో కలుసుకొన్న ఆ ఇద్దరూ ఇంచు

మించు ఒకరి నొకరు గుర్తుపట్ట లేనంతగా మారిపోయి తమ తమ బిడ్డలు ఇరువదివళ్ళ వయస్సుగల వారయ్యాక ఎక్కడో ఏదో రైలు ప్రయాణంలో కాకతాళీయంగా కలుసుకొని 'నువ్వా అంటే నువ్వా' అనుకొని, గుర్తుపట్టిన తర్వాత తమ పాత స్నేహాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఇరువురూ ఒకరి కుటుంబ విషయాలొకరు అడిగి తెలుసుకొన్న తర్వాత, రెండు మూడుసార్లు రెండు కుటుంబాల వారూ కలుసుకోవడం జరిగింది, స్త్రీలుకూడా. ఆ వంకన, గురుచరణ్ కుటుంబంలోని స్త్రీలూ, పురుషులూ, పెద్దలూ, చిన్నలూ అందరూ కూడ సుధను చూడడం జరిగింది.

సుధ అతిలోక సౌందర్యవతి కాదు; కాని సౌందర్యవతే. కనుముక్కు తీరు గలిగిన కళైన ముఖం. తలిదండ్రుల చాటున పెరిగి అణకువ నేర్చినది. చదువుకున్నది; తల్లి వద్ద గృహకృత్యశిక్షణ బాగా పొందినది. పైగా ఏదో పార్టుటైమ్ జాబ్ చేసి నెలకు మూడువందల పైన సంపాదిస్తోంది. సాంప్రదాయం కలిగి, నలుగురూ మెచ్చుకునే మంచి నడతగల కుటుంబం. ఇంకేముంది? ఆమెను తమ యింటికి తెచ్చుకోవాలనే ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నవారై అందుకు తగిన సమయంకోసం చూడసాగారు.

"ఎంతైనా మనం మగపిల్లవాడి వాళ్ళంకదా నాన్నగారూ. మనంత మనం అడిగి తేలిక కాకూడదు" అన్నది గురుచరణ్ పెద్దకూతురు లక్ష్మి. అవ్వటానికి ఆడదే అయినా తలలు మార్చి తలలు పెట్టడంలో దిట్ట ఆమె. ఏ పనిలో

అయినా ఆమె సలహా, ఆమోదమూ లేనిదే ఆ తలిదండ్రు లేమీ చేయరు.

అందువల్ల రెండు కుటుంబాలకూ పరిచయస్థుడూ స్నేహితుడూ అయిన ఒక వ్యక్తిచే నేర్పుగా ఈ ప్రస్తావన చేయించారు.

లోకాన్ని ఎంత జూచినా లోకజ్ఞానం మాత్రం కలగని ఇంద్రసింగ్ ఈ ప్రస్తావనతో అపురూప వజ్రమేదో లభించి నంతగా ఆనందించి పొంగిపోయాడు.

"మన స్నేహితుడిలా గంటున్నాడు గురుచరణ్. ఏమంటావ్? మీ అబ్బాయి లక్నోలో ఉద్యోగం చేస్తున్నాడటగా?" అని అడిగేశాడు పనిమాలా గురుచరణ్ ఇంటికి వెళ్ళి.

"మంచిదే!" అవకాశమూ జారవిడుచుకోలేదు, లౌక్యమూ వదులుకోలేదు గురుచరణ్. "కానీ... ...మీరు చూచుకోవాలంటే మరి అబ్బాయిని ... ... ఎలాగ? చేస్తూన్నది పెద్ద ఉద్యోగం. అంత సెలవు దొరకదు ఓ పది రోజులు దొరకడమే కష్టం. ప్రయాణానికే మూడు నాలుగు రోజులు మింగుడు పడిపోతుంది. ఆ తర్వాత చూచుకోవడాలూ, నచ్చడాలూ అయ్యాక మనం ముహూర్తాలు పెట్టుకోవాలి, పెళ్ళి పనులు మొదలుపెట్టాలి. వ్యవధి ఏదీ, వీటన్నిటికీ? ఇవాళ్టికి సరిగా వారం రోజులకి ఓ లగ్నం వుంది. ఈ సంవత్సరానికిదే ఆఖరు — మళ్ళీ లగ్నాలు లేవు, పదినెలల వఱకూ."

ఆలోచనలో పడ్డాడు ఇంద్రసింగ్, ఏం సమాధానం చెప్పడానికీ తోచక.

"పిల్లవాడిని చూడకుండా ఎలాగ? వాళ్ళందరూ మన పిల్లని శుభంగా చూసుకున్నారు ... ... డబ్బుకూడా సమకూర్చుకోవాలి కదా మరి! ఆడపిల్లవాళ్ళ మాయె! వాళ్ళకే ముందీ-ఏడు రోజుల్లోనే కాదు, ఏడు గంటల్లో కూడా చేసేయగలరు పెళ్ళి" అన్నది సుధ తల్లి గారి.

ఆ మాటలలో మాట కలిపింది రంజన. "అదేం లేదు. మీరు పెళ్ళి ఖర్చుకి మా తం డబ్బు ఏర్పాటు చేసుకుంటే చాలు. మాకేం కట్నాలూ, కానుకలూ పోయనవసరం లేదు" భర్త గురుచరణ్ కంటె లౌకికురాలు ఆమె

"ఔను. మా అబ్బాయిని మేం అమ్ముకోము ఈనాడు అందరూ చేస్తూన్నట్లుగా. పిల్ల అందచందలూ, గుణం, వంశ ప్రతిష్ఠా ముఖ్యం మాకు!" గురుచరణ్, అతడి పెద్ద కుమార్తె లక్ష్మి ముక్తకంఠంతో అన్నారు

"మీ మాట సరే ... ... మరి అబ్బాయి ఉద్దేశ్యం ... ..." గారి సందేహం వెలిబుచ్చింది.

"లేదు లేదు గారీజీ!" నొచ్చుకున్నట్లుగా అన్నది రంజన. "మా వంశం అంటే ఏమనుకున్నారు? బిడ్డలు మాకు ఎదురు చెప్పడమనేది లేనే లేదు. మీరే చూస్తారుగా? మేం కుదిర్చిన పెళ్ళి తలవంచుకు చేసుకుంటాడు. మీ యిష్ట ప్రకారమే చేయండమ్మా అని ఏనాడో చెప్పాడు. అయితే, వాడలా అన్నాడని మేం అమానుషంగా డబ్బుకోసం కక్కుర్తి పడి వాడి ఆశలు నాశనం చేస్తామా? ఈనాటి యువకుల కేం

కావాలో మాకు తెలియదూ ? పిల్లకి చదువూ, అందం —
అంతేగా ?'' ఒక్కసారి గ్రుక్క త్రిప్పుకోవడానికి ఆగింది.

అంతలో ఆమె పెద్ద కూతురు లక్ష్మి అందుకుంది : "మా తమ్ముడంటే తమ్ముడు కాదు, పొగడ కూడదు. సుగుణాల ప్రోగు. ధర్మరాజు. సుధ వాడికోసమే పుట్టిందో, వాడే సుధకోసం పుట్టాడో తెలియదు మరి. మీరే చూస్తారుగా ?''

నేటి హిందూ సమాజంలో ఏ ప్రాంతం వారైనాసరే సాధారణంగా ఇటువంటి గొప్ప విషయాలు వినడం చాలా అరుదు. అందుకే--దిగిరాని దైవమే దిగివచ్చి అందరాని వరమేదో తమకు అతి సునాయాసంగా అనుగ్రహించినట్లు భావించినవారై సుధను గురుచరణ్ యింటి కోడలిగా పంపివేయడానికి నిశ్చయించేసుకున్నారు. ఆ సంతోషంలో పిల్లవాడిని కన్య తరఫువారు చూడాలనేది కూడా విస్మరించారు; విస్మరించడం కాదు — అవసరం లేదనుకున్నారు. సంఘంలో పేరు ప్రతిష్ఠలూ, గౌరవమూగల గురుచరణ్ వంటి వ్యక్తి అబద్ధం చెప్పడమే ?

"ఏమంటావ్ తల్లీ మరీ ? నీ యిష్టమేమిటి ?'' నామకార్థంగా అడిగారు సుధను.

ఎంత చదువుకుని ఉద్యోగాలు చేస్తూన్నా ఒక సాంప్రదాయానికీ, కట్టుబాటుకూ అలవడిన హిందూకన్య ఏం సమాధానం చెప్తుందో అదే సమాధానం చెప్పింది సుధ : "మీ యిష్టం అమ్మా, నాకేం తెలుసు ?'' సుధ యిచ్చిన సమాధానాన్ని విన్నవారూ, కన్నవారూకూడా వేనోళ్ళ స్తుతించారు,

ఆమె అణకువనూ, పెద్దల యెడల ఆమెకు గల గౌరవం వగైరాలనూ.

కాని, ఆమె మనసులో ఎటువంటి తుఫాను రేగుతూన్నదో ఎవరెరుగుదురు? తలిదండ్రుల కష్టసుఖాలూ, కుటుంబ స్థితీ బాగా అర్థం చేసుకొన్న బుద్ధిమంతురాలు సుధ. తమ కుటుంబం ఒకనాడు ఐశ్వర్యవంతులలో లెక్కించబడినదే అయినప్పటికీ, కాలక్రమంలో ఈనాటికి మధ్య తరగతి కోవలోనికి దిగజారింది. పెద్ద కుమార్తెల ముగ్గురి వివాహాలూ చెప్పుకోదగిన కట్నమే యిచ్చి వివాహం చేశాడు ఇంద్రసింగ్. వారిలో ఒక అల్లుణ్ని తన స్వంత ఖర్చులపై విదేశాలలో చదువుకుకూడా పంపించాడు. ఆడపిల్లలకూ, మగపిల్లలకూ కూడ లక్షణంగా చదువు చెప్పించాడు. ఈ అన్ని కారణాల వలనా, ఒకటి రెండు వ్యవహారాలలో బాగా స్నేహితులైన వాళ్ళే దగా చేసినందువల్లా అతడి ఆర్థిక పరిస్థితి కాస్త సన్నబడింది. అయితే, ఇవన్నీ లోకులకు గ్రహింపు లేదు. లోకుల దృష్టిలో ఇంకా ఇంద్రసింగ్ ధనవంతులలోనే లెఖ్ఖ. కారణం ధనంవున్నా లేకున్నా ఇంద్రసింగ్ కుటుంబపు దర్జాలు పూర్వం వలెనే సాగిపోతూన్నందువల్ల.

కుటుంబపు కష్టసుఖాలకూ, తన యావజ్జీవితాదృష్టాన్ని నిర్ణయించే వివాహానికీ ముడిపెట్ట కూడదని సుధ భావించ లేదు. విశేషించి ఆమెకు విధి బలీయతపై నమ్మకమెక్కువ, నుదుటి అదృష్టాన్ని ఎవరూ మార్చలేరనీ, వివాహాలు స్వర్గం లోనే అవుతాయనీ నమ్మేవారిలో ఆమె ఒకతె. అందుకే తలిదండ్రులకే తన బాగోగులు చూచే బాధ్యతను వదలివేసింది.

వివాహం అయిపోయింది.

వరుడి రూపురేఖలు సాధారణం. ఏమంత లెక్కించ దగినవి కాదు. ఉద్యోగమూ, సంపాదనాకూడా సామాన్యమై నవే. అతడి తలిదండ్రులు చెప్పిన హోదా కాదు; చాలా మామూలు ఉద్యోగం. వారు చెప్పినంత జీతమూ కాదు. అందులో సగానికంటె కూడా తక్కువే.

"నా తలిదండ్రులు మోసం చేసినట్టున్నారు. అందులో నాకు భాగంమాత్రం లేదు. నాసంపాదన యిదీ, నా ఉద్యోగం యిదీ. ముందే నీకు చెప్పడం మంచిదనే ఉద్దేశ్యంతో చెప్తు న్నాను. అబద్ధాలతో మన దాంపత్యం ప్రారంభం కావడం యిష్టం లేదు." అని చెప్తూన్న భర్త మనోనైర్మల్యానికీ, సత్యసంధతకూ అచ్చెరువంది చూచింది సుధ. కన్య కోరి ఆరాధించేంత రూపవంతుడు కాకపోయినా, అది వఱకెన్నడూ చూచి యెరుగని క్రొత్త మనిషైనా అందుకే - అతడి సహృ దయతకే కట్టుబడిపోయింది సుధ.

భార్యాభర్తలు పాలూ తేనెలా కలసిపోయారు.

సుధ అంటే సుధీర్‌కు ప్రాణం!

సుధీర్ సుధకు ప్రాణాధికం!! ఇంతకంటె ఏం కావాలి ఏ సంసారమైనా స్వర్గంతో సరితూగేందుకు ?

అయితే, ఎంతటి స్వర్గంలోని అమృతాన్నైనా హరించగల శక్తి ఈ దేశపు అత్తలలో చాలా మందికి ఉన్న దనేందుకు ఎన్నో సంసారాలను తార్కాణంగా చూపవచ్చు. ఇది ఎవ్వరూ కాదనలేని నిజం; ఖండించలేని సత్యం!

"పెద్ద కూతుళ్ళందరికీ యిచ్చినట్టే యిస్తాడనుకున్నాను కానీ, ఇదేం బాగుందని ఇలా బోడి బొమ్మను పంపేస్తాడనుకున్నానా ? అమ్మో ! ఎంత గట్టివాడు ఇంద్రసింగ్ !"

"ఏమోనమ్మా కలికాలం! ఎవడు కన్న బిడ్డకు వాడు శక్త్యానుసారం ఏదో ముట్టజెప్పుకుంటాడు కానీ, ఇలా శనిని వదిలించుకున్నట్టు వదిలించుకుంటాడనుకుంటామా ? ఔనులే ! నా స్నేహితుడు-నా స్నేహితుడి కూతురని ముడెట్టుకున్నందుకు బాగా కుదిరింది మా ఇంటాయన రోగం ! ఏదీ, స్నేహం ఏం ఒరగబెట్టిందీ ? సాటి వాళ్ళందరి పిల్లలకూ ఎంతెంత కట్నాలు పలుకుతున్నాయో చూస్తే గుండె బేజారెత్తిపోతోంది. ఎందుకూ, నేనూ కన్నాను కొడుకుని, పెంచాను, పెళ్ళి చేశాను. ఏం జరిగిందీ నాకు ? ఎదుగు చాకిరీ తప్ప. కొడుకుతో బాటు కోడలూ ఉద్యోగాని కెళుతుంది. డబ్బు మూటగట్టుకుంటుంది. ఈ దిక్కుమాలిన చాకిరీయే నాకు మిగిలింది. ఇందుకే వరుణ్ని చూడనైనా చూసుకోకుండా ముడెట్టేశారు !"

ఈ విధంగా వచ్చిన చుట్టాల ఎదుటా, స్నేహితుల ఎదుటా చిన్నబుచ్చటం మొదలెట్టింది రంజన కోడల్ని, పెళ్ళైన వారం రోజులకే.

తల్లి అగ్నికి ఇంకా ఆజ్యమూ, సమిధలూ ఎగద్రోయడమే కూతురు లక్ష్మి వంతు. "ఇంతకూ సుధీర్ దమ్మా తప్పంతా ఇప్పుడెన్నుకుని ఏం లాభం? ఎవర్నని ఏం ప్రయోజనం ? పెళ్ళి కుదిరిందని టెలిగ్రాం యివ్వగానే ఏదో పెళ్ళాం కోసం ముఖం వాచిన వాడికిమల్లే వచ్చి ముడి పెట్టుకున్నాడు.

ఇంతకట్నం యిస్తే చేసుకుంటానూ – అని వాడు బిగదీసు కూర్చుంటే చచ్చినట్లు యివ్వకపోయే వాళ్ళా ? కుదిరిన పెళ్ళి ఎలా మానుకుంటాడూ, ఆడపిల్లని కన్నవాడూ ?"

వచ్చిన బంధు, స్నేహ వర్గంలోవారుకూడా, "ఏమ్మా, మీా యింట్లో కట్నాలిచ్చే ఆనవాయితీ లేదా ? మీా తలి దండ్రులకు చెప్పి, అడిగి నువ్వే తెచ్చుకోవాలి మరి! జొత్తిగా యిలా దమ్మిడీ కట్నం లేకుండా రావడం నీకూ సిగ్గు. వీళ్ళకీ సిగ్గు." అని హితబోధలు చేస్తూంటే ఏమీా మాట్లాడలేని సుధ శిరస్సు భూమిలోనికి కృంగిపోయేది.

క్రొత్తయిల్లు, క్రొత్త మనుషులు, కడకు భర్తకూడా క్రొత్తవాడూ, క్రొత్త అనుభవాలు. ఒక్కమాటలో చెప్పా లంటే క్రొత్త జీవితం. వివాహం గురించీ, దాంపత్యం గురించీ కన్నెదశలోని మధురోహలన్నీ క్రమంగామాయమై బెరుకూ, పిరికితనం, నిరాశా ఆవరించ సాగినై సుధ మనసును ఆనాటి కానాడు.

"ఎందుకూ, కంఠశోష. మనం వాగడమే కానీ, ఏమైనా మాట్లాడుతుందా ఏమన్నా నా? గడుసుది ! ముంగిలా కూర్చుంటుంది. మన నోళ్ళే అందరికీ వినపడతాయి." అనడం మొదలుపెట్టింది రంజన.

ఈ గోలంతా తన వద్దనే కానీ, తీరా తల్లీతండ్రీ ఎప్పుడైనా చూడవస్తే వాళ్ళను ఏంతో మర్యాదలు చేయడం, వారు చూచేట్లుగా సుధకూ భర్తకూ ఒకేసారి అన్నం పెట్టడము – ఇదంతా చూచి లోలోన సుధ విస్మయమందేది. ఇంద్రసింగూ, భార్యా తమ కుమార్తె అదృష్టానికి మురిసి

పోయి, వియ్యపురాలి మంచితనాన్ని పొగిడి దండిగా పళ్ళూ, కూరలూ, పువ్వులూ, పిండివంటలూ పంపుతూండేవారు. అన్నీ అందుకున్నా రంజన ముఖంలో ఆవగింజంత సంతోషం కాని, సంతృప్తి కాని కన్పించేది కాదు. అన్నీ కూతుళ్ళ ఇంటికీ, తన అప్పచెల్లెళ్ళ యిళ్ళకూ సరఫరా చేసేసి. "అసలైన కట్నం ఎగ్గొట్టి ఈ కాయాకసరూ ఇచ్చి కళ్ళ నీళ్లు తుడుస్తు న్నారు" అని సుధ వద్ద సూటిపోటీగా మాట్లాడేది.

"పోనీ, ఈ మాట మా అమ్మనూ నాన్ననే అడగ వచ్చు కదా! నన్నంటే నేనేం చేయగలను?" అన్నది విసుగెత్తిన సుధ ఒకనాడు.

వింటూనే తారామండలాని కెగసి పడింది రంజన శివశక్తిలాగా. "అబ్బో. సమాధానాలు కూడా నేరుస్తున్నా వన్నమాట. పిట్టకూత కెక్కింది. అనవసరంగా మాట్లాడ బోకు. జాగ్రత్త!" అంటూ హుంకరించింది.

నిశ్చేష్టపోయి నిస్తేజంగా నిలబడిపోయింది సుధ. ఎవరో బొత్తిగా మాట్లాడటం రానిదాన్నీ, తమ చేతికింద కూలి మనిషినీ అన్నట్టుగా ఇదేం ధోరణి? అనవసరంగా మాట్లాడ వద్దని ఇంటి కోడల్ని — అందునా తగిన వయసూ, చదువూ కలిగి మంచీచెడుల విచక్షణ తెలిసి నమ్రతగా మెలిగే కోడల్ని అనవలసిన మాటేనా యిది! మాట్లాడకపోతే ముంగిలా మాట్లాడదని గోల; మాట్లాడితే అనవసరంగా మాట్లాడవద్దని కసురుకోవడం. ఇదెక్కడి గోల? అసలింక ఎలా మసలాలి, ఎలా బ్రతకాలి వీళ్ళ మధ్యన? అంతకంతకు ఆరోజు కారోజు ఆ యింట మనుషుల అసలు స్వభావాలు తేటతెల్లమౌతున్న

కోలదీ, వారిపై ఆరంభంలోగల భక్తి గౌరవాలు నశించ సాగాయి సుధకు.

ఆరంభంలో ఎవరెంతగా బాధాకరమైన మాటలు అన్నప్పటికీ. ఎంత మనస్తాపం కలిగించినప్పటికీ సుధ పట్టించు కొనేది కాదు. కారణం భర్త చల్లని ప్రేమ, నిండైన అను రాగం. అతడికి డబ్బుపిచ్చి లేదు, వంకర టింకర మాటలు లేవు. ప్రేమగా మాట్లాడుతాడు, అనురాగం చిందిస్తూ ఆద రంగా చేరదీస్తాడు. లోకాన్నే మైమఱపించుతాడు.

కానీ, రాను రాను సుధకు భర్తలో కూడా మార్పు గోచరించసాగింది. అతడైతే నోటితో ఏమీ పరుషంగా మాట్లాడడు. డబ్బు సంగతి ఎత్తడు. కాని అతడి అనురాగం సన్నగిల్లింది; ఆప్యాయత తక్కువైంది. ప్రేమభాషణాలు విన రావడంలేదు. అత్తా ఆడబిడ్డల గోలకు ఏ మాత్రం చెక్కు చెదరని సుధ పతిలోని మార్పుకు మాత్రం కలవరపడసాగింది. క్రొత్త బులుపు తగ్గిపోయిందా ? లేక ఈ విషబీజాలు అతడి మనసులో కూడా నాటుకున్నాయా ?

ఒకనాడు స్నానం చేసి వచ్చి గదిలో అడుగిడబో తూన్న ఆమెకు అప్రయత్నంగా పిన్నత్త మాటలు విన వచ్చాయి స్పష్టంగా. పొరుగూళ్ళో వుంటూన్న ఆమె చుట్టపు చూపుగా వచ్చింది నాల్గురోజులనాడు అక్క యింటికి ...

"అయితే ఇక ఇంతేనట్రా బాబూ ? దమ్మిడీ పుచ్చుకో కుండా పుణ్యానికి పుస్తె కట్టేశావన్నమాట ? మీ బాబుకు లేకపోతే నీకైనా ఆ మాత్రం ఇంగితం వుండక్కర్లా ? అడ గందే అమ్మైనా పెట్టదట అబ్బో? ఇలా తేరగానైతే చాలా

మంది చేసేద్దురు పెళ్ళిళ్ళు!" అంటూ వికటంగా చేతులు తిప్పుతూ వికృతమైన ముఖభంగిమలు ప్రదర్శిస్తూ మాట్లాడు తోంది.

అంతలో సుధ రాకను పసిగట్టిన ఆడపడుచు లక్ష్మి సౌంజ్ఞ చేయడంతో ఆపడ వాగ్ధోరణి గొంతు ఎవరో నొక్కేసి నట్టుగా ఆగిపోయింది. ఏదో పనున్నట్లుగా సుధీర్ అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయాడు.

మరోనాడు వంటింట్లో నుంచి గుసగుసలు లాంటి మాటలు వినవస్తున్నాయి, దేవుడిగదిలో పూజ చేసు కొంటూన్న సుధకు. అది సుధీర్ చెల్లెలు రేణూ వచ్చింది పురిటికి పుట్టింటికి.

"మొదటి పురుడు. బిడ్డకు అన్నీ పెట్టి పంపాలి. ఓ అయిదు వేలైనా కావాలి. ఎక్కడైనా నోటు రాసి తీసుకురా ... ... సుధకు తెలియనీయకు .. ..." మరి విన లేకపోయింది సుధ అత్తగారి వాచాలతను.

భార్యకు ఇటువంటి ఇంటి విషయా లేమీ తెలియకుండా దూరంగా వుంచమని బోధిస్తోందన్నమాట! భార్యాభర్తల మధ్య అన్యోన్యత నేర్పబడవలసిన పెద్దామె అగాధాలనూ, తేడాలనూ కోరి సృష్టిస్తోంది! సక్కుబాయి అత్తగారు, మీరాబాయి అత్తగారువంటి ఘనస్త్రీలకు పుట్టిల్లు కదా మరి ఈ భారతావని!

విరక్తిగా నవ్వుకొంది సుధ.

భార్య ఒక అనామక వస్తువులాగా రాను రాను ఆమెతో ఏమీ సంప్రదించటం మానివేశాడు సుధీర్. తల్లి

చెప్పినట్లుగా ఎక్కడో అప్పు రాసి తెచ్చి అవసరం జరిపించాడు. రేణు ఘనంగానే వెళ్ళింది బిడ్డ నెత్తుకొని అత్తింటికి. 'నా పెద్దకొడుకు బుద్ధిమంతుడు గనుక ఇలా ఇంటికి అండగా నిలిచాడు. రేణును అత్తింటికి పంపటానికి అయిదారు వేలు సర్దాడు' అని మామ గురుచరణ్ ఎవరితోనో అంటూండగా విన్నందువల్ల, 'ఓహో !' అనుకొంది సుధ.

'బాభీ బాభీ' అని కొత్తలో ప్రేమగావుండే రేణు కూడా రాను రాను, తమ అన్నా చెల్లెళ్ళను విడదీసే రాక్షసిని చూచినట్టు భయం భయంగా చూడటం, తూచి తూచి మాట్లాడడం, అన్న యిచ్చిన వస్తువులను తను చూడరాదన్నట్టు దాచుకోవడం చూస్తే మనస్సు పిండినట్లయ్యేది సుధకు.

'వీళ్ళూ తనవంటి ఆడవాళ్ళే కదా ! వాళ్ళకూ సంసారాలూ, భర్తలూ వున్నారు కదా ! ఇలా తమకూ తమ భర్తలకూ మధ్య దూరం వుండాలనీ, రహస్యా లుండాలనీ కోరుకుంటారా వీళ్ళు ? ఎంతటి నీచ మనస్తత్వాలు ? ఎంతటి అల్పమైన బుద్ధులు ! సుధ స్థానంలోవున్న ఏ స్త్రీయైనా సరే అటువంటి వాళ్ళను ఏవగించుకోకుండా ఉండదు.

వాళ్ళు చాటు మాటున అనే సూటి పోటి మాటలు భర్తకు చెప్పాలని రెండు మూడుసార్లు ప్రయత్నించింది. అతడా అవకాశం మాత్రం ఎప్పుడూ ఈయలేదు. కానీ రాను రాను తానే ఆ ప్రయత్నం మానుకొన్నది. అతశంత అతడు విన్న వాటికీ, అతడి ఎదుటే సుధను చిన్నబుచ్చుతూ మాట్లాడిన దానికీ కూడా ఏమీ జరగనట్లే మౌనంగా ఉండిపోతాడు

జడపదార్థంలాగా. భార్య గౌరవాన్ని రక్షించలేని భర్త కూడా ఓ భర్తేనా? తల్లినీ, తండ్రినీ, తోబుట్టువులనూ ప్రేమించవలసిందే, ఎవరూ వద్దనరు. కాని అందుకోసం అమాయకురాలైన భార్యను చిన్నబుచ్చడం, ఆమెకు తెలియకుండా యింటి విషయాలు దాచడం, అప్పులు చేయడం సమర్థనీయమా? న్యాయమా? ఇదే సుధ బాధ.

'ఆయన గుండె అంత గట్టిదీ, లోతుదీ అయినప్పుడు నే నెందుకు చెప్పి తేలిక పడాలి? పోనీయ్. వాళ్లు బాధ్యతా, నీతీ విస్మరించారని, నేనూ అలాగే ఎందుకు ప్రవర్తించాలి? తల్లిమీద కుమారుడికికానీ, భార్యమీద భర్తకుకానీ చాడీలు చెప్పి విడదీసేది సాని తరగతికి చెందుతుంది. నేను ఉత్తమ స్త్రీని. తేలికగా ప్రవర్తించి ఆత్మగౌరవం నశింపజేసుకోను' అనుకొన్నది అత్యున్నత సంస్కారం గల సుధ.

"రేణూకు పెట్టిన ఖర్చంతా అనవసరమనీ, తనది నాలుగు నెలల జీతం మనం వాడుకున్నామనీ నీ భార్య అందరకూ చెప్పిందట, రేణూ కొడుకు బాఉసాలలో'." అంటూ లేనిపోని అపనింద ఒకటివేసి సుధీర్ మనసు బాగా విరిచేశారు. అయితే ఈ అసత్యాన్ని పుట్టించినదే కాక యింత బాగా అతడికి ఎక్కించి, కోపం వచ్చేట్లుచేసిన నేర్పు తల్లిదో, కూతుళ్ళదో నిర్ణయించుకోలేకపోయింది సుధ. అతడు తన దగ్గరి కొంత డబ్బు తీసుకున్న మాట నిజమే. అయితే ఆ విషయం తాను బంధువులతో కాదు కదా, తన తలిదండ్రులకు కూడా చెప్పలేదు. మరి ఈ అపప్రధ ఏమిటి? శుభకార్యమన్న తర్వాత ఎన్నో అవసరాలుంటాయి, ఎంతో

ఖర్చవుతుంది. ఈ మాత్రానికి లెఖ్ఖ చూచుకొని తేలికపడే నీచ స్వభావమా తనది? ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడని, ఇరుగు పొరుగుల ఇళ్ళకైనా వెళ్ళని తాను ఇవాళ క్రొత్తగా చూచిన బంధువులతో అటువంటి విషయాలు మాట్లాడగలదని చెప్పిన వాళ్ళకు బుద్ధి లేకపోతేపోయె — తన గురించి సర్వం తెలిసిన భర్త ఎలా నమ్మగలిగాడు? తన మంచి చెడు లక్ష్యరలేని — యితరు లందరివంటి వాడేనా, తన జీవితమంతా ముడిపడిన భర్త కూడా?

ప్రసవానికి పుట్టింటికి వెళ్ళింది సుధ అదే సమయంలో.

అగ్నిజ్వాలలా రగులుకు పోయింది హృదయం. "అలా వున్నావేం, అల్లుడునుంచి ఉత్తరాలు వస్తున్నాయా?" అన డిగే తలిదండ్రుల ప్రశ్నలకు బలవంతాన నవ్వుతూ సమాధానం చెప్పేది, మనస్సును చంపుకొని. ఇంత నీచమైన గొడవను వాళ్ళైతే లేవదీయగలిగారు కానీ, ఈ అల్ప విషయాన్ని అందరికీ తానే విధంగా చాటగలదు సిగ్గు విడచి?

ఎవ్వరు ఎన్నైనా వాగవచ్చుగాక! ఎంతటి అభాండాన్నైనా వేయవచ్చుగాక! కట్టుకున్న భర్తకూడా ఆ ఇతరులతో కలసిపోయి, భార్య తత్వం తెలియనట్లుగా లోకం దృష్టిలో అల్పురాలినిగా చేసి చూపడం అభిమానవతియైన ఏ భార్య సహించగలదు? అయినా సుధ సహించింది. తన స్వభావం భర్తకు విడమరచి, తన మనసును పరచింది ఉత్తరాలలో. అయినా అతడు మారలేదు. అతడి కోపం ఎంత వఱకూ పోయిందంటే సుధ మగబిడ్డను ప్రసవించింది —

కనీసం ఆ సంతోషంలోనైనా చూడటానికి రాలేదు. అతడి తరఫునుంచి ఎవ్వరూకూడా రాలేదు చూడటానికి.

"అత్తింటినుంచి ఎవ్వరూ వచ్చినట్టులేదే? యెందువల్లనో! మగబిడ్డ - వంశోద్ధారకుడు కూడా! జొత్తిగా ఒక్కళ్ళైనా చూడ్డానికి రాకపోవడ మేమిటీ?" అని అందరూ ఆరాగా అడుగుతూంటే సుధ అనిర్వచనీయమైన బాధకు గురయ్యేది.

తనలాగే కాపురం చేసి, బిడ్డలను మోసి కన్న తోటి స్త్రీలకే తన బాధ అర్థం చేసుకొనే సహృదయత లేదు. ఇక అటువంటి సాధక బాధకాలు తెలియని మగవాడు - భర్తకు అర్థం కాలేదని వాపోవడం దేనికీ? గర్భిణిగా ఉన్నప్పుడు మనస్సు నిర్మలంగా ఉండాలనీ, ఎంత ప్రశాంతంగా ఎంత సంతోషంగా ఉంటే బిడ్డ అంత ఆరోగ్యంగా ఉంటాడనీ డాక్టర్ అన్నది. మరి తన అదృష్టమేమిటో బిడ్డను మోసినప్పుడూ ప్రశాంతత లేదు మనస్సుకు, ప్రసవానంతరం అసలే మనశ్శాంతి లేదు. నిస్సహాయ క్రోధంతో ఉడికిపోయిన సుధ మనస్సు అందుకు కారణమైన వాళ్లను తీవ్రంగా శపించకుండా ఉండలేకపోయింది: 'స్త్రీకి ఈ అవస్థ నిజంగా మరో జన్మ అనే అంటారు. మరి ఇటువంటి స్థితిలో అయినవారినే చూచుకోకుండా చేసిన ఈ అపనింద ఎవరు లేవదీశారో వాళ్ళు నా ఉసురుకొట్టి వాళ్ళు బాగా ప్రేమించుకొనే బిడ్డలకూ, అయినవారికి దూరమైపోతారు!" అని కసిదీరా తిట్టుకుంది మనసులో. ఈ అప్రియమైన ఘట్టంతో ఆమెకు తనవారూ, తన కుటుంబం అనే తీపీ బాధ్యతా పూర్తిగా నశించిపోయాయి. తనను

పరాయి దానినిగా అక్కరలేని దానినుగా చూచే వాళ్లూ తనకు అక్కరలేని వాళ్ళుగానే నిర్ణయించుకొంది.

తనకు అన్ని సుఖాలూ అందజేసిన భార్యను, చెప్పుడు మాటలు విని ఇంత నిర్లక్ష్యంచేస్తూన్న భర్తపై ఒక్కసారిగా అసహ్యం పెల్లుబికింది. 'కానీయ్, విధవ జీవితం. అంతగా బ్రతకలేకపోతే ఛస్తాం, అంతే కదా!' అనే విరక్తి భావం మనస్సును ఆవరించివేయగా భర్తకు ఉత్తరాలు వ్రాయడం కూడా మానుకొన్నది.

ఓ నెల అలాగే ఒకరి సంగతులు ఒకరికి తెలియకుండా గడచిపోయింది. ఆ యింటి కాకి ఈ యింటి మీాద వాలక పోవడంతో సుధ తలిదండ్రులకు, అన్నదమ్ములకు కూడా ఈ విషయాలన్నీ తెలిసిపోయాయి. ఇంతవఱకూ తమ కుమార్తె అదృష్టవంతురాలనీ, అంతే లేని ప్రేమ కడలిలో ఆమె హాయిగా విహరిస్తోందనీ భావించిన ఇంద్రసింగ్ దంపతులకు ఈ మేడిపండు నిజస్వరూపం బహిరంగం కావడంతో కుమిలిపోయారు. అయితే సుధ వారిని కఠినంగా శాసించింది, అవతలివారితో ఎటువంటి రాయబారాలూ జరుపడానికి వీల్లేదని.

ఒకనాడు సుధ అనుకోని విశేషాలతో ఎదురు చూడని ఉత్తరం వచ్చింది, భర్తనుంచి ఆశించని విధంగా.

"ప్రియమైన సుధా,

నాకు ఢిల్లీ ట్రాన్స్ఫరైంది. అర్జంటుగా వెళ్ళి పోవాల్సి వచ్చింది. వ్యవధి లేదు. అందువల్ల నీ దగ్గఱకు

రాకుండానే వెళ్తున్నాను. బాధపడవద్దు. అక్కడ యిల్లు దొరకగానే టెలిగ్రాం ఇస్తాను. మీ అన్నయ్యను తీసుకొని వచ్చేయి. ప్రయాణానికి అన్నీ సిద్ధం చేసుకో. జరిగినవన్నీ మఱచిపో, నువ్వే రాకపోతే నేను పిచ్చివాణ్ణయిపోతాను. అన్నీ మర్చిపోయి బయల్దేరుతావుగా ? బాబును చూడాలని ఎంతగా మనసు పడ్తున్నానో నీకేం తెలుసు ?

నీ సుధీర్ "

నిస్సహాయంగా జీవంలేని నవ్వు నవ్వుకొంది సుధ. జన్మ జన్మలకూ మఱచిపోలేని బాధను అనుభవింపజేయడం-మఱచి పొమ్మనడం ! ఎంత సులువుగా అనగల్గుతున్నారు ? అంత అభ్యర్థనలోనూ మఱలా ఎంత దర్పం ! క్షమాపణలే లేవు వచ్చి స్వయంగా తీసుకెళ్తే, తలిదండ్రులు గోల పెట్టారని కాబోలు తాను వెళ్ళిపోయాడు ! వ్యవధి లేదంటే నమ్మలేకపోయింది సుధ. తనను రప్పించుకొని కలసిమెలసి వుండటానికే అతడు దూరంగా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది. పోనీ ఈ మాత్రమైనా ప్రయోజకత్వమున్నది — అనుకొంది కొంతలో కొంత తృప్తిగా

విషయం తలిదండ్రులకు చెప్పక తప్పలేదు.

"ఇంత అవమానాన్ని మఱచి, నా అంత నేను వెళ్ళాలని అనుకోవడం లేదు నాన్నా" అన్నది సుధ.

ఇంద్రసింగ్ కుమార్తెను కన్నీటితో దగ్గఱకు తీసుకున్నాడు. "ఆడజన్మే కష్టాలకు మారుపేరు తల్లీ, నీ బాధ

నాకు తెలుసు. నిన్ను వెళ్ళమని నేను ఆజ్ఞాపించడం లేదు. వెళ్ళమని సలహా మాత్రం చెప్తున్నాను"

"నాన్నా!" సుధ కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

"వద్దు తల్లీ, ఏడవొద్దు. ఇన్నాళ్ళ నుంచీ నువ్వూ, నేనూ, మీ అమ్మా అందరం మనసుల్లో ఏడుస్తూనే వున్నాం. చాలు, ఇంకా వద్దు. ఈ మనసుల్లో ప్రజ్వరిల్లిన మంట తేలికగా ఆరేది కాదు, అయినా బలవంతంగా ఆర్పాలి మరో దారి లేదు ... ... 'వెళ్ళక ఏం చేస్తావ్, ఎలా బ్రతుకుతావ్' అనే చచ్చు ప్రశ్నలు నేను ప్రశ్నించదలచుకోలేదు నిన్ను. ఎలాగైనా బ్రతకగలవు కానీ... నీ బిడ్డ శ్రేయస్సు దృష్ట్యా వెళ్ళమని నేను సలహా ఇస్తున్నాను. నా బిడ్డ శ్రేయస్సుకూడా ఆలోచించిన తండ్రిగా చెప్తున్నాను. నువ్వూ చదువుకున్న దానవు, లోకం అంతో యింతో తెలిసిన దానవు, బాగా ఆలోచించుకో."

మహాసంగ్రామానికి లోనైన సుధ మనసు ఆమెను మాట్లాడనీయలేదు.

తల్లి గారి కల్పించుకొంది. "చూడు సుధా. అందరికీ ఎంతో మంచి మంచి సలహా లిస్తావ్. స్వవిషయాలలో యింత బేలవైపోయా వేమిటి తల్లీ! ఆనాడు లక్ష్మి అవతారమైన సీతాదేవికే అపనిందలూ, కష్టాలూ, ఎడబాట్లూ తప్పలేదు. ఇక మన మనగా ఎంతమ్మా, మానవ మాత్రులం! చూడూ ఇంకా నీకంటే బాధలకూ మనస్తాపాలకూ గురైన స్త్రీలెందరో వున్నారు మన చుట్టూ. వాళ్ళకంటె మన బ్రతుకు మెరుగని సంతృప్తిపడాలి. అంతే, ఇలా సరిపెట్టుకోక తప్పదు తల్లీ ఆడ

దానికి. ఇప్పుడు కన్నకూతురు కష్టంలో వున్నదని నీ తండ్రి యింత బాధపడ్తున్నారేకాని, వెనక్కి తిరిగి చూచుకొంటే_ ఒకనాడు-నీ వయస్సులో-నీకంటె చిన్నదాన్నేకూడా, అప్పుడు పెళ్ళిళ్ళు తొందరగా చేసేసేవారు — ఎంత బాధలనుభవించానో మీ నాన్నగారూ, ఆయన తల్లీ కలసి నన్నెన్ని యిడుములకు గురి చేశారో - కన్నబిడ్డవైన నీకు చెప్పడము బాగుండదు !"

ఆశ్చర్యంగా చూచింది సుధ.

తల వంచుకున్నాడు ఇంద్రసింగ్ సిగ్గుతో.

గౌరి అన్నది మజిల : "ఆనాడు నేనే ఇలా ఓర్పు లేకుండా ప్రవర్తిస్తే, మీ నాన్నతో పడిపోతే మీరేమయ్యే వారు ! ఆలోచించు."

సుధ మాట్లాడ లేకపోయింది.

తల్లి యింకా చెప్పింది : "చిత్రమైన మానసిక హింసకు ప్రతిరూపాలే మనలాంటి స్త్రీలు సుధా, యిందుకు తరతమ బేధం లేదు. సరిపెట్టుకు పోనిదే మార్గాంతరంలేదు. సరిపెట్టుకుంటే వ్యధ నీ ఒక్కతెదే జీవితానికి ఎదురు తిరిగితే నీ చుట్టూవున్న అందరికీ మనఃక్లేశమే. ఎవ్వరికీ మనశ్శాంతి ఉండదు. ఇది గ్రహించుకో. వాళ్ళు చెప్పే కొండెపు మాటలు విని నీ భర్త నిన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడు కానీ, తనకు తానుగా అల్పబుద్ధితో నిన్ను బాధించడం లేదు. అందుకు సంతోషించవలసిందే. ఏం చేస్తాడు. తలిదండ్రులను- ఎంత చెడ్డవాళ్ళైనా సరే కాదనలేనంత ఉత్తము డతడు నీ

విషయంలో సమర్థనీయం కాకపోయినా, అది ప్రతడి సుగుణ మనక తప్పదు."

నిర్జీవంగా నవ్వుకొంది సుధ. అల్లుడి నమ్రతను చూస్తే అమ్మకు అభిమానం! తన అమ్మానాన్నల గౌరవం కోసం, పెళ్ళాం గౌరవాన్ని దిగదుడవాలా ? ఇది మాత్రం హర్షించదగినది కాదు!'

తుఫాను అనంతరపు భయంకర ప్రశాంతతవంటి ప్రశాంతత ఆవరించింది సుధ అంతరంగాన్ని. ఆలోచించీ ఆలోచించీ జీవితంతో రాజీకి నిశ్చయించుకొంది. అదే ఈ దేశపు స్త్రీ ప్రత్యేకత!

'నేను ఏడిస్తే నాకంటె ఎక్కువగా అమ్మా నాన్నా ఏడుస్తారు. నేను బాధ పడడంవల్ల నాకంటె అధికంగా నా తలిదండ్రులను బాధ పెడ్తున్నానన్న మాట! ఎవళ్ళో రాక్ష సంగా ప్రవర్తిస్తూన్నందుకు నే నెందుకు ఏడవాలి ? నావారి నెందుకు బాధ పెట్టాలి ? వాళ్ళ ధ్యేయం నన్నేడిపించడమే అయితే, నా ధ్యేయం నవ్వుతూ ఆనందంగా జీవితాన్ని గడి పేయడంగా పెట్టుకుంటాను. మనసులో లేని ఆనందాన్ని ముఖం మీద ప్రదర్శించడానికి, ఎదలోలేని నవ్వును పెదవు లపై నర్తింపజేయడానికి, యితరులు హరింపజేయాలని చూస్తూన్న నా సంతోషాన్ని నిలుపుకోవడానికి, నన్ను కన్న వారికి, నేను కన్నవారికీ మనశ్శాంతి కలుగ జేయడానికి పోరాడ తాను; ఎవళ్ళో మూర్ఖులకోసం నేను ముఖం వేలాడవేయను. ఏ నాటికో ఓ నాటికి వాళ్ళ పాపఫలం వాళ్ళే అనుభవిస్తారు.'

అనే స్థిర నిశ్చయానికి వచ్చిన సుధ భర్త వద్దకు వెళ్ళి పోయింది.

భార్యాభర్తల ఈ అన్యోన్యతను అత్తమామలు సహించలేకపోయినా, ఇప్పటికీ మాం రానవుండే ఇరువురిమధ్యనా లేనిపోని కలతలను సృష్టింప ప్రయత్నించినా, కాపురంమాత్రం మరీ అమృతభాండంలా కాకపోయినా ఒక విధమైన అన్యోన్యతతోనే సాగిపోయింది ఇంతవఱకూ.

* * * * * *

కళ్ళకు కట్టినట్టుగా స్వీయ జీవిత విశేషాలను తనకు నిస్సంకోచంగా వినిపించుతూన్న సుధను ఆశ్చర్యంతో, విస్ఫారిత నయనాలతో చూస్తూండిపోయిన శైలజ మెల్లగా తేరుకుని జాగ్రదవస్థకు వచ్చింది.

"ఇంతటి అగ్నిపర్వతాలను ఏలో దాచుకుని - ఇంత ఖుషీగా నవ్వుతూ పేలుతూ ఉండగలుగుతున్నావా సుధా? ఇదెంత కష్టం?" అన్నది ప్రశంసాపూర్వకంగా.

"తప్పదు బాభీ." దీర్ఘంగా నిశ్వసించింది సుధ.

"మనకోసం కాదు. మన చుట్టూ ఉన్న — మన సంతోషంకోసం తాపత్రియపడే తలిదండ్రులకోసం, మనపై, మన ప్రేమానూరాగాలపై ఆధారపడిన పసికందులకోసం — ఈ జీవన సమరం సాగించక తప్పదు. ఏ జీవితమూ సుఖమయం కాదనీ, జీవన పోరాటం సాగించని దే మనుగడ లేదనీ తెల్సుకున్ననాడు మనోవ్యథ దానంతటదే ఉపశమిస్తుంది. ఎటొచ్చి ఒక్కొక్క జీవితపు సమస్యలు ఒక్కోలాగుంటాయి. అంతే బేధం."

బలవంతంగా నవ్వింది శైలజ. "ఎమ్మే చదివిన దానవు, తెలివైనదానవు. అందుకే యింత బాగా ఆలోచించ గలవు!" అన్నది మెచ్చుకోలుగా.

"కాదు." అనంగీకారంగా తలాడించింది సుధ. అడుగడుగునా జీవితంలో మనం నేర్చుకొనే పాఠాలకు ఏ చదువులూ, డిగ్రీలూ సరితూగవు బాభీ. అయినా ఇప్పుడేమైంది. ఇంకా నా సంసార జీవిత గ్రంథంలో తొలి ఘట్టం మాత్రమే గడిచింది. ముందుముందు ఇంకా ఏమేం సమస్యలు ఎదురౌతాయో తెలియదుకదా! మా సంసారం కొత్త కుదుటబడేసరికి ఆయన విదేశాలకు వెళ్ళారు. ఈ దూరం మళ్ళీ మామధ్య ఏ అగాధాలను సృష్టిస్తుందో - నన్ను అమితంగా ద్వేషించే అత్తా, ఆడపడుచులు ఆయనకు ఎటువంటి ఉత్తరాలు వ్రాసి మనస్సు విరిచేస్తారో, ఈ చీకాకులో ఆయన అక్కడ ఎవరి వలలో పడతారో తెలియదుకదా!

'మా వాళ్ళంటే నీకెందుకో మొదట్నుంచీ యిష్టం లేదు. నేను అక్కడ లేనేలేను, నువ్వైనా వెళ్ళి కొన్నాళ్ళు వాళ్ళ దగ్గర వుండకపోతే ఏం బాగుంటుందీ?' ఈ విధంగా వుంటాయి అంత దూరాన్నుంచి ఆయన నాకు వ్రాసే ప్రేమ లేఖలు! ఏమనుకోవాలి ఆ మనిషి మనస్తత్వాన్ని?"

తిరిగి తానే అన్నది సుధ "ఇది సమాధానం లేని ప్రశ్న, వ్యాఖ్యానాని కందని సమస్యలు ఇవి. అందుకే ఇక ప్రశ్నలు వేసి సమాధానాలు చెప్పుకుంటూ కూర్చోదలుచుకోలేదు నేను. ఈ జీవన సమరం సాగించడానికి మాత్రం

తగిన శక్తిని సమకూర్చుకొంటున్నాను...... ఇదే నువ్వడిగిన చైతన్య స్రవంతి అసలు స్వరూపం !"

తన కథనం ముగిస్తూనే పకపకా నవ్వేసింది సుధ. తిరిగి ఎప్పటి సుధ అయిపోయింది.

సుధతో పాటు శైలజ నవ్వలేకపోయింది.

"ఏమిటి బాభీ ! బోర్ కొట్టిందా ? లేక నాకోసం నువ్వు బాధపడ్తున్నావా ?" సుధ ప్రశ్నించింది సూటిగా చూస్తూ.

అప్పటికీ శైలజ నవ్వలేకపోయింది.

"నాకు తెలుసు" గంభీరంగా అన్నది సుధ. "నువ్వింత సానుభూతి చూపగలవు గనుకనే నిస్సంకోచంగా, బిడియం లేకుండా నా జీవిత రహస్యాలను నీకు చెప్పగలిగాను బాభీ...... బాధపడే మనసే ఎదుటి బాధను అర్థం చేసుకోగలదు; నే నెరుగుదు - కాదు, నే నూహించగలను. నువ్వూ ఎందుకో బాధపడ్తున్నావ్. సంతోషంగా లేవు. అందుకే ఇటువంటి సంభాషణ తెచ్చావు."

ఔనా కాదా అన్నట్టు పరిశీలనాత్మకంగా చూసింది.

ఖంగారుపడింది శైలజ. "అబ్బే లేదు, లేదు." అన్నది తత్తరపాటుతో.

చిరునవ్వు నవ్వింది సుధ. "అదేమిటో నాకు చెప్పవద్దు లే. కాని నన్ను డబాయించకు. నేనా మాత్రం గ్రహించగలను. బ్రతికిన నాలుగునాళ్ళూ నవ్వుతూ ఆనందంగా గడపాలనే నిర్ణయం తీసుకో బాభీ. అప్పుడు అందుకు వలసిన ధైర్య స్థైర్యాలు వాటంతటవే వస్తాయి."

బయట జీప్ వచ్చి ఆగిన శబ్దం వినవచ్చింది.

శేఖరం గొంతు వినవస్తోంది.

"అదుగో మీ ప్రాణేశ్వరు లేతెంచారు. ఈ దిగులూ, చికాకూ పోగొట్టేస్తారింక" అంటూ పకపకా నవ్వుతూనే లేచింది సుధ.

"ఏమిట్రా శైలూ, ఇంకా ఇక్కడే కూర్చున్నావా పడుకోకుండా ?" అంటూ ప్రవేశించాడు శేఖరం.

చిరునవ్వుతో భర్త చేతినుంచి కోటు అందుకుంది శైలజ.

"నమస్తే భాయీసాబ్ !" సుధ నిండుగా నవ్వుతూ నమ్రతతో నమస్కరించింది.

"నమస్తే, నమస్తే" నవ్వుతూ తిరిగి చేతులు జోడించాడు శేఖరం. "ఏమిటి స్నేహితురాళ్ళిద్దరూ గోష్ఠి సలుపుతున్నారు ?"

"అదే అదే భయ్యాజీ! ఇంతవఱకూ ఎక్కడున్నారూ, ఏమిటీ అనే ఫజిల్ బాభీ తానొక్కతే సాల్వు చేయలేక నా సహాయం కోరింది." గలగలా నవ్వేసింది సుధ.

"మరి వస్తానూ. గుడ్ నైట్ బాభీ, నమస్తే భాయీసాబ్ !" అంటూ నిష్క్రమించింది.

డ్రైవర్ని పిలిచి, సుధను ఇంటివఱకూ దిగవిడచి రమ్మని పంపించింది శైలజ.

"భలే హుషారైన అమ్మాయి. మంచిది పాపం !" అన్నాడు శేఖరం బొత్తాలు విప్పుకొంటూ.

శైలజ మాట్లాడలేదు, మాట్లాడవలసిన అవసరం లేదు గనుక.

భార్యను చూచీ చూడనట్లుగా ఓరగా చూశాడు శేఖరం.

అది గమనించకపోలేదు శైలజ. తాను ఇంటికి ఆలస్యంగా జేరినందుకు భార్య అంతరంగం ఎలావుందో, ఆమె ముఖకవళికలను చూచి నిశ్చయించుకోవటానికే అతడలా జాగ్రత్తగా చూస్తున్నాడు!

"భోజనం చేద్దామా ?" అన్నాడు తూచి తూచి.

"ఊఁ. నడవండి మరీ. ఇప్పటికే పొద్దుపోయింది. ముందు స్నానం చేస్తారా ?"

"వద్దులే ఇవాళ్టికి స్నానం. పిల్లలు పడుకున్నారా?"

"మరి!" ప్రశ్నిస్తూనే నవ్వింది శైలు. "ఇది పిల్లలు మేలుకొని ఆటలాడుకొనే సమయమా ?"

లోలోపల ఆశ్చర్యపడ్డాడు శేఖరం. తానిలా ఆలస్యంగా వచ్చినప్పుడు శైలు నవ్వు ముఖంతో ఎప్పుడూ మాట్లాడిన గుర్తు లేదు. ఏమిటీ మార్పు!

భర్త ఆలోచనలను లీలగా గ్రహించగలిగిన శైలు లోలోపలే నవ్వుకొంది. సుధ వెళ్ళిపోయినా ఇంకా ఆమె మాటలే చెవులలో రింగు మంటున్నాయి.

గ్రీష్మతాపానికి ముకుళించుకుపోయిన ప్రాణికి, మలయ పవనాలు చల్లగా తగిలి సేద దీర్చినట్లుగా ఉన్నాయి సుధ హితోపదేశాలు.

"ఏమిటాలోచిస్తున్నావ్ శైలూ ?" టేబిల్ ముందు కూర్చుని కూడా, భోజనం మాని పరధ్యానంగా చూస్తూన్న భార్యను ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు శేఖర్.

"ఏమీ లేదు." అతని కనులలోనికి చూస్తూ నిండుగా నవ్వింది శైలజ.

కిటికీనుండి వీస్తూన్న మలయ పవనాల తాకిడికి ముచ్చటగా ముఖంపై కదలాడుతూన్న ఆమె ముంగురులను పరవశించి చూస్తూండిపోయాడు శేఖరం.

•